భక్తికి స్ఫూర్తి

- భజన సంప్రదాయానికి ఆద్యుడు భక్తరామదాసు
- 38 రాగాల్లో 196 కీర్తనలు
- ఆనంద 'భైరవి' తొలిసారి ఉపయోగించిన ఘనత ఆయనదే



భద్రాచలం, ఫిబ్రవరి 11: భక్తరామదాసు పేరు వినని వారు.. ఆయన పాట పాడని భజన బృందమూ ఉండదు.. భద్రాద్రి క్షేత్ర ఆవిర్భావానికి కారకుడు భద్రమహర్షి అయితే భద్రాద్రి రామయ్య వైభవాన్ని దశదిశలా చాటిన మహాభక్తాగ్రేసరుడు భక్తరామదాసు.. భక్తికి స్ఫూర్తి.. భగవంతుడిని కీర్తించడంలో భజన సంప్రదాయానికి ఆద్యుడు ఆయన.. తాను పని చేసేది ముస్లిం ప్రభుత్వంలోనైనా హిందూ ఆలయాన్ని నిర్మించిన మహాధైర్యశాలి. తాను చేసే పని ప్రజలకు ఉపయోగపడడంతో పాటు ప్రభువుకు కూడా మంచి పేరుతెచ్చేదే అనే సదుద్దేశ్యంతో రెవె న్యూ శిస్తు సొమ్ముతో భద్రాచలంలో రామందిరాన్ని నిర్మించారు. సీతారాములకు విలువైన ఆభరణాలను చేయించాడు. భద్రాద్రి రాముడి మహత్తుని వేనోళ్ల కొనియాడారు. రాముడు ఉన్నాడు అనటానికి సాక్ష్యం రామదాసు చరిత్రే. భద్రగిరికిపురాణ చరిత్ర ఎంత ఉన్నా భద్రాచలం అంటే రామదాసు, రామదాసు అంటే భద్రాచలం అనే విడదీయలేని గొప్ప సంబంధం కలిగి ఉంది. తన భక్తితోనే కాకుండా రచనలతోనూ భద్రాద్రి రాముడిని సేవించి తరించిన ధన్యచరితుడు భక్తరామదాసు. వాగ్గేయకారులుగా కీర్తనల రచయితల్లో రెండోవాడిగా, భజన సంప్రదాయానికి ఆద్యునిగా తరిగిపోని భక్తితో, చెరిగిపోని కీర్తిని ఆర్జించుకున్న రుషిలాంటి వ్యక్తి భక్తరామదాసు..

శ్రీరామదాసు ధ్యాన మందిరంలో రామదాసు కీర్తనలు

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రంగనాయకుల గుట్టపై నిర్మించిన రామదాసు ధ్యానమందిరంలో భక్తరామదాసు కీర్తనలను రాతిపై చెక్కి గోడలపై అమర్చారు 1960లో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునరుద్ధరణ సమయంలో సేకరించిన రూ.1.87 లక్షలతో శ్రీరామదాసు ధ్యానమందిర నిర్మాణం చేపట్టారు.

38 రాగాల్లో 196 కీర్తనలు

రామదాసు భద్రాచల రాముడిని స్తుతిస్తూ భక్తి పారవశ్యంలో అనేక రచనలను చేశారు. వాటిలో కొన్ని కీర్తనలకు ప్రముఖ స్థానం ఉంది. 'ఆనంద భైరవి' రాగంలో మొట్టమొదటిసారి కీర్తన స్వరపరిచిన వాగ్గేయకారుడిగా భక్తరామదాసు సుప్రసిద్ధులు. దురదృష్టవశాత్తు ఆయన రాసిన కీర్తనల్లో 38 రాగాల్లో రచించిన సమారు 196కీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు రామదాసు రచించిన దాశరధి శతకం శతక సాహిత్యంలో మకుటాయమానమైంది. ఇందులోని పద్యం తెలియని తెలుగు సాహిత్య అభిమానులు లేరంటే అతిశయోక్తి కాదు. అలాగే వీరు రాసిన సంస్కృత చూర్ణిక కూడా రామదాసు పాండిత్యాన్ని మనకు తెలియజేస్తుంది. వీరి రచనల నిండా భక్తిప్రపత్తులు మెండుగా కనిపిస్తాయి. రామభక్తుల్లో గొప్పగా చెప్పబడే త్యాగరాజ స్వామి రామదాసును స్ఫూర్తిగా తీసుకున్నారు. ఎంతోమందికి రామభక్తులకు గోపన్న మార్గదర్శకులు.

బహుళ ప్రాచుర్యం కల్పించిన డాక్టర్ మంగళంపల్లి, ఎస్పీ బాలు

భక్తరామదాసు కీర్తనలకు బహుళ ప్రాచుర్యం కల్పించిన వారిలో డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రమణ్యం ప్రముఖ స్థానం వహిస్తారు. అలాగే సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి సైతం భక్తరామదాసు కీర్తనలను విస్తృత ప్రచారం కల్పించారు. ఈ క్రమంలో రామదాసు కీర్తనల్లోని రత్నాల్లాంటి కీర్తనలను స్వీకరించి నవరత్న కీర్తనలుగా గానం చేసి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలు ఎలాగైతే ప్రసిద్ధిని పొందాయో నేదునూరి వారి చొరవతో ఆ విధంగా ప్రాచుర్యం పొందాయి. అనంతరం ఆయన శిష్య బృందంలో ఎంతో కీలకమైన మల్లాది బ్రదర్స్ సైతం భక్తరామదాసు కీర్తనలను మరింతగా ప్రచారం చేస్తున్నారు. తెలుగువారిలో ఇలా ఎంతో మంది ఉండగా ఇతర రాష్ట్రాల్లో సైతం రామదాసుగారి కీర్తనలను అక్కున చేర్చుకుని సంగీత సభల్లో సైతం ఆలపిస్తున్నారంటే రామదాసుగారి కీర్తనల్లో ఉండే మాధుర్యం, మహత్తు మనకు అర్థం కాకపోదు.

నేటినుంచి వాగ్గేయకారోత్సవాలు

నేలకొండపల్లిలోనూ రామదాసు జయంత్యుత్సవాల నిర్వహణ



భక్త రామదాసుకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కంచర్ల శ్రీనివాసరావు

భద్రాచలం/నేలకొండపల్లి, ఫిబ్రవరి 11:భద్రాద్రి రామయ్యకు అపరభక్తుడు, వాగ్గేయకారుడు భక్తరామదాసు 391వ జయంతి ఉత్సవాలను భద్రాచలంలో సోమవారం నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నారు. భద్రాద్రి దేవస్థానం, అలివేలుమంగ చారిటబుల్ ట్రస్టు, శ్రీచక్రా సిమెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు దేవస్థానంలోని చిత్రకూట మండపంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. భద్రాచలంలో గత 42సంవత్సరాలుగా భక్తరామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తున్నారు. తాజా ఉత్సవాల్లో భాగంగా సోమవారం పంచామృతాలతో అభిషేకం, నగర సంకీర్తన, నవరత్న కీర్తనలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని భక్తరామదాసు విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం భక్తరామదాసు, తూము నరసింహదాసు తదితర మహనీయుల చిత్రపటాలతో నగర సంకీర్తన చేస్తారు. చిత్రకూట మండపంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రారంభిస్తారు. ఈ క్రమంలో తొలుత సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి రూపొందించిన నవరత్న కీర్తనలను ఆలపించనున్నారు. ఔత్సాహిక సంగీత కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేలకొండపల్లిలోనూ ఉత్సవాలు

భక్తరామదాసు (కంచర్లగోపన్న) జన్మస్థలమైన ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధాన్యమందిరంలోనూ రామదాసు జయంతి ఉత్సవాలను 12నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ఖమ్మం కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతో పాటు పర్యాటకశాఖ మంత్రి సైతం హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తరామదాసు జయంత్యుత్సవాల నేపథ్యంలో కంచర్ల వంశానికి చెందిన పదోతరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు దంపతులు ఆదివారం నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో భక్తరామదాసుకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యాంప్రసాద్, అర్చకుడు రమేష్ పాల్గొన్నారు.



'ప్రరవే' నూతన కార్యవర్గం

ట్రోలింగ్ భూతాన్ని ఎదిరిస్తాం

- బాధితులకు అండగా నిలుస్తాం
- ప్రరవే రాష్ట్ర మహాసభల్లో వక్తల శపథం
- తెగబడిన వారిని ఎదిరించిన విధంపై బాధితుల కథనాలు
- రెండు రోజులపాటు విస్తృత చర్చలు
- ఘనంగా ముగిసిన సభలు

7

పాతాళానికి జలం


- పడిపోతున్న భూగర్భ నీటిమట్టం
- ఎండుతున్న చెరువులు, బావులు
- తిరుమలాయపాలెం, ముదిగొండ, కామేపల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లో తీవ్రం
- భూగర్భజలాల పెంపునకు చర్యలు శూన్యం
- ఈ వేసవిలో తాగునీటికి ఇబ్బందులేర్పడే ప్రమాదం

7



బ్రాహ్మణీయ లక్షణాలను పుణికి పుచ్చుకున్న మన విద్యారంగాన్ని ఇప్పటి పాలకులు కూడా కొనసాగిస్తూ ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో బడ్జెట్లు రూపొందిస్తున్నారని అఖిల భారత విద్యాహక్కుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ తెలిపారు. ఉపాధ్యాయులు సామాజిక దృక్పథాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సైన్స్ కూడా వక్రమార్గంలో వెళుతోందని అందరు కలిసి వైజ్ఞానిక సమాజాన్ని నిర్మించుకోవాలని, అప్పుడే మానవాళి జీవనం సుఖమయం అవుతుందన్నారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన టీపీటీఎఫ్ ద్వితీయ మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

- ఖానాపురంహవేలి, ఖమ్మం



మాట్లాడుతున్న అఖిల భారత విద్యా హక్కు వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్

ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో

బడ్జెట్ల రూపకల్పన

- ఉపాధ్యాయులు సామాజిక దృక్పథాన్ని కలిగి ఉండాలి
- భారత విద్యాహక్కుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్
- ఖమ్మంలో ఘనంగా ప్రారంభమైన టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు

ఖమ్మం నగరంలోని నయాబజార్ ఉన్నత పాఠశాలలో ఆదివారం టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలకు ప్రొఫెసర్ జగ్ మోహన్‌సింగ్, సి.కాశీం, విమలక్క, గుమ్మడి నర్సయ్య, టీ.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మహాసభల్లో ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పని ప్రదేశంలో ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారాలు గురించి వివరించారు. ప్రస్తుతం సైన్స్‌ను కూడా వక్రమార్గం పట్టిస్తున్నారన్నారు. అందరం కలిసి వైజ్ఞానిక సమాజాన్ని నిర్మించుకోవాలని, అప్పుడే మానవాళి జీవనం సుఖమయం అవుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ సామాజిక దృక్పధాన్ని కలిగి ఉండాలన్నారు. పీఎంశ్రీ పథకం కింద కేవలం 1500పాఠశాలలను ఎంపిక చేసి రైజింగ్ ఇండియ పేరిట పక్కదారి పట్టించారన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ అంతరాలు లేని విద్య అందరికీ విద్య అనే నినాదంతో నూతన సమాజంకోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కుల మతాంతరాలు లేని, జండర్ సమానత్వంతో బోధించే విద్యకోసం కృషి చేయాలన్నారు. పేద వర్గాల పిల్లలందరికీ సమాన విద్య అందేలా చూడాలన్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2,75,891కోట్లలో విద్యకు.. రూ.21,389 కోట్లు కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో కేవలం 7.75శాతం మాత్రమేనన్నారు. గత సంవత్సరం కేటాయింపుల కన్నా కొంత మెరుగైనా ఇదికూడా నామ మాత్ర కేటాయింపులేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో విద్యకు 15శాతం బడ్జెట్ ఇస్తామని హామీ ఇచ్చినా అందులో సగం మాత్రమే కేటాయించారన్నారు. 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ప్రస్తావన లేకుండా కొత్తగా ఇంటర్నేషనల్ స్కూళ్లకు రూ.500కోట్లు కేటాయించడం శోచనీయమన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం రూ.3000 కోట్లు కోరగా కేవలం రూ.500 కోట్లు కేటాయించడంతో ఈ ప్రభుత్వం కూడా గత సర్కార్ దారిలోనే వెళుతోందనిపిస్తోందన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలుగా మారిన 317జీవో కామన్ సర్వీస్‌రూల్స్, టెంపరరీ, కాంటాక్ట్ తదితర వెట్టిచాకిరీ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయ ఖాళీలను నింపాలని డిమాండ్ చేశారు. వేర్వేరు మేనేజ్‌మెంట్లలో కులాలవారీగా నడుస్తున్న గురుకులాల్లో విద్యా విలువలను కాపాడాలని ఆయన కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికిభావస్వారూప్యం కలిగిన ఉపాధ్యాయ సంఘాలతో కలిసి పోరాటాలు సాగిస్తామన్నారు. రాజ్యాంగ విలువలను కాలరాసేందుకు ముందుకొచ్చిన నూతన విద్యా ముసాయిదా-2020ని వ్యతిరేకించాలని ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు కె. వేణుగోపాల్ కోరారు. నిర్దిష్టమైన వ్యవస్థను ప్రతిపాదించని ఎన్ఈపి-2020 కొఠారీ కమీషన్ సిఫార్సులను ఖాతరు చేయకుండా ప్రత్యమ్నాయ బ్రాహ్మణీయ సంప్రదాయ విధానాలను ప్రతిపాదించిందన్నారు. గత ఉద్యమాల స్ఫూర్తితో ప్రస్తుత సమస్యలపై పోరాటాలను ముందుకు తీసుకు వెళ్లాలని ఫెడరేషన్ పూర్వ అధ్యక్షుడు రాములు సూచించారు. సభలో ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తదితరులు ప్రసంగించారు. సంఘం ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభల్లో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగిరెడ్డి, మనోహర్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'చేనేత'కు పూర్వ వైభవం తీసుకొస్తాం

- వ్యవసాయం, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- హైదరాబాద్‌లో రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పద్మశాలీసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కమర్తపు మురళిని సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 11: చేనేత సమస్యలపై దృష్టిసారించి పూర్వ వైభవం తీసుకొస్తానని వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పద్మశాలి భవనంలో అఖిలభారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పద్మశాలి సంఘం రాష్ట్ర నూతన అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. అన్ని రంగాల్లో పద్మశాలీలు రాణించాలని, వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి. ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం మాట్లాడుతూ అందరిని కలుపుకొని ముందుకెళ్లాలని, నూతన కార్యవర్గానికి సూచించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ చేనేత సమస్యలపై త్వరలో అఖిలపక్షాన్ని పిలిచి సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మలను కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని సంఘ నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆదేశాలను అనుసరిస్తూ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘాన్ని రాష్ట్ర జిల్లా మండల గ్రామాల్లో విస్తృత పరుస్తానని పేర్కొన్నారు. చేనేత పద్మశాలి సంఘ అభివృద్ధికి మంత్రి సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. చేనేతల సమస్యల గురించి మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి రూ.4కోట్ల 52లక్షలు మంజూరు చేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాల శ్రీరాములు, అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్, మహిళ విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతల, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు పుట్ట పాండురంగయ్య, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రం, గౌరవ అధ్యక్షుడు మెతుకు సత్యం, తెలంగాణ పద్మశాలి యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షుడు గుంటుక రూప, గ్రేటర్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, గ్రేటర్ యువజన అధ్యక్షుడు గుర్రం శ్రవణ్ , మహిళా విభాగం అధ్యక్షురాలు పొరండ్ల శారద, బొమ్మ ప్రవల్లిక, తెలంగాణ మీడియా విభాగం అధ్యక్షుడు బొమ్మ అమరేందర్, బురం శంకర్ తదితరులు పాల్గొన్నారు

ప్రజలను సీఎం తప్పుదోవ పట్టించారు

- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



ఖమ్మం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ లోక్‌సభాపక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ ప్రాజెక్టులపై తాను అడిగిన ప్రశ్నలకు వచ్చిన సమాధానాలను వక్రీకరించారని పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం చెప్పినవన్నీ అబద్ధాలేనని, శాశ్వతంగా కేంద్రానికి ప్రాజెక్టులను అప్పగించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఈ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు తన పేరు పేర్కొంటూ ఈ విధమైన ఆరోపణలు చేయటం తగదన్నారు. తెలంగాణను పోరాడి తెచ్చుకున్నది సాగునీళ్ల కోసమేనని, కేసీఆర్ ఎప్పుడూ తెలంగాణ ప్రజల ప్రయోజనాల విషయంలో రాజీ పడలేదన్నారు. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతూ కృష్ణాజలాలను కేఆర్ఎంబీకి అప్పచెప్పింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్ల హక్కులను కృష్ణార్పణం చేసిందన్నారు. జనవరి 17న జరిగిన కేంద్ర ప్రభుత్వ సమావేశంలో ప్రాజెక్టుల నిర్వహణను కేంద్ర పరిధిలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఇది తీవ్ర తప్పిదమన్నారు. తెలంగాణ నీటి వాటా ఎంతో తేల్చి చెప్పాలని ఎంపీ నామా సూచించారు. తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టుల నిర్వహణ కేంద్రప్రభుత్వం చేతిలోకి వెళ్లిందన్నారు. ఇంత పెద్ద నిర్ణయం తీసుకునేముందు ప్రతిపక్షాలతో కనీసం రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించలేదన్నారు. కృష్ణా నదీజలాల్లో తెలంగాణ హక్కు తేలేవరకు ఉద్యమం సాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోపే అనాలోచితంగా శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీసిందని, ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. గతంలో జరిగిన కేఆర్ఎంబీ సమావేశాల్లో కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణను బోర్డుకు అప్పగించేందుకు అంగీకరించలేదని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సమావేశాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించినట్లు మినిట్స్‌లో ఉందని నామా స్పష్టం చేశారు.

మైనింగ్ శాఖ దాడులు

- మూడు మట్టి టిప్పర్ల స్వాధీనం
- సత్తుపల్లి మండలంలో ఆగని మట్టి అక్రమ తవ్వకాలు

6

భద్రాద్రిలో పారదర్శకంగా ఆర్జిత సేవలు

నేటినుంచి ఈ-టికెటింగ్ సౌకర్యం

భద్రాచలం, ఫిబ్రవరి 11: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆర్జిత సేవలు మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి ఆలయ ప్రాంగణంలోని రెండు టికెట్ కౌంటర్లలో ఈ-టికెటింగ్ ద్వారా ఆర్జిత సేవలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో నిత్యం సుప్రభాతసేవ నుంచి పవళింపు సేవ వరకు నిర్వహించే సేవలకు ఈ-టికెటింగ్ విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. అలాగే ఇకపై రామ భక్తులు తమ మొక్కుబడులుగా ఇచ్చే బంగారం, వెండి ఆభరణాలకు సైతం కంప్యూటరైజ్డ్ రశీదును వారు ఇచ్చిన ఆభరణం ఫోటోతో సహా ముద్రించి ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా రెండు దశాబ్దాల క్రితమే భద్రాచలం దేవస్థానంలో ఈ-టికెటింగ్ విధానం అమల్లో ఉండగా సర్వర్, ఇతర సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ఆ విధానానికి దేవస్థానం సిబ్బంది మంగళం పలికారు. అనంతరం మళ్లీ మాన్యువల్‌గా టికెట్లను విక్రయిస్తున్నారని, ఈ క్రమంలో ఏడాది క్రితం దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎల్.రమాదేవి దేవస్థానంలో అవినీతి, అవకతవకలకు చెక్‌పెడుతూ వసతి సౌకర్యాల బుకింగ్, పరోక్ష ఆర్జిత సేవ టికెట్లను ఆన్‌లైన్‌లో భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. తాజాగా ఆలయంలో సైతం మాన్యువల్ టికెట్ విధానాన్ని నిలిపివేసి ఈ-టికెటింగ్ విధానాన్ని నేటినుంచి అందుబాటులోకి తెచ్చారు.

ట్రోలింగ్ భూతాన్ని ఎదిరిస్తాం

- ప్రరవే రాష్ట్ర మహాసభల్లో వక్తల శపథం
- రెండురోజుల పాటు విస్తృత చర్చలు, బాధితుల కథనాలు
- ఆరు దశాబ్దాల నవలా రచయిత్రుల వివరాలకు పుస్తకరూపం
- ఘనంగా ముగిసిన సభలు

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 11: ప్రజా రచయిత్రుల వేదిక(ప్రరవే) రాష్ట్ర ఏడవ మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సమాజానికి పెనుసంకటంగా మారి మహిళలకు మానసిక క్షోభ కలిగిస్తున్న ట్రోలింగ్ భూతాన్ని సమూలంగా నిర్మూలిస్తామని మహాసభ తీర్మానించింది. ట్రోలింగ్‌కు భయపడకుండా ఎదుర్కొనేలా మానసిక ధైర్యాన్ని కల్పిస్తామని ఇందు కోసం చట్టపరంగా, న్యాయపరంగా, సమాజ పరంగా తోడ్పాటును అందిస్తామని వక్తలు హామీఇచ్చారు.

ట్రోలింగ్‌ను ధిక్కరించి ముందుకు సాగాలి ఘంటా చక్రపాణి



ట్రోలింగ్ విష సంస్కృతిని ధిక్కరించి ముందుకు సాగాలని టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. సభల ముగింపు ప్రసంగం చేస్తూ తాను సైతం ట్రోలింగ్‌బాధితుడినే అని చెప్పారు. ట్రోలర్లు, మహిళలు, వెనుకబడిన, దళిత వర్గాలు, మైనార్టీలపై తమ ప్రతాపం చూపుతున్నాయన్నారు. కత్తి పద్మారావులాంటి వారిపైకూడా ఇదే తరహా వేధింపులు తప్పక పోతుండటం బాధాకరం అన్నారు. తెలంగాణ తల్లి ప్రతీకలను మార్చాల్సిన అవసరం లేదని తాను పోస్టు పెట్టినందుకు తనపై కక్ష్యకట్టిన కొందరు ట్రోలింగ్‌లకు తెగబడ్డారన్నారు.

కం'ట్రోలింగ్', పెట్రోలింగ్‌ల రూపం ట్రోలింగ్ ప్రసేన్



నియంత్రించటం, ఆధిపత్యం చెలాయించటంల ఉమ్మడి రూపంగా ట్రోలింగ్ జాఢ్యాన్ని పరిగణించాలని కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అభిప్రాయపడ్డారు. ముగింపు సభలో తన ఆప్త వ్యాక్యం తెలియ జేస్తూ తాను సైతం పలు దఫాలు ట్రోలింగ్‌కు గురయ్యానని చెప్పారు. సినీ సాహిత్యాన్ని, పుస్తకాల ముందు మాటలను తప్పుపడుతూ కొందరు తన తల్లిని సైతం దూషించటం బాధ కలిగించిందన్నారు. ట్రోలర్లపై తిరగబడాలో, మౌనంగా ఉండాలో అర్థం కావటం లేదన్నారు.

బాధితులకు అండగా నిలుస్తాం విమలక్క



ట్రోలింగ్ దాడులకు గురవుతున్న బాధితులకు తమ వంతు అండగా నిలుస్తామని ప్రజాగాయని విమలక్కఅన్నారు. మహిళల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్న ట్రోలింగ్‌ను ఉపేక్షించవద్దని సూచించారు. ట్రోలింగ్‌కు తాను గురయ్యానని, అయితే ధైర్యంగా ఎదుర్కొన్నానని చెప్పారు. పలు అభ్యుదయ గీతాలను ఆలపించారు.



'నారి సారించిన నవల' పుస్తక ఆవిష్కరణ దృశ్యం

'నారి సారించిన నవల' పుస్తకం ఆవిష్కరణ

ప్రరవే మహాసభల్లో భాగంగా 'నారి సారించిన నవల' పుస్తకాన్ని ప్రముఖ స్త్రీవాద కవయిత్రి శిలాలోలిత ఆవిష్కరించారు. మరో ప్రముఖ కవయిత్రి శీల సుభద్రదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శిలాలోలిత మాట్లాడుతూ మహిళల సాహిత్య ఘనత ప్రపంచంలో పరుష సాహిత్య వేత్తలకు తీసిపోనిది అన్నారు. మరో కవయిత్రి కొల్లా పురం విమల మాట్లాడుతూ1900 నుంచి 1960 వరకు నవలలను రాసిన మహిళల వివరాలను సేకరించి ఒక పుస్తకంగా ముద్రించటం అభినందనీయమన్నారు. పుస్తక సంకలనం చేసిన ప్రరవే తెలంగాణ కార్యదర్శి కాత్యాయినీ విద్మహేను అభినందించారు.



హాజరైన సాహితీవేత్తలు

ట్రోలింగ్ బాధితుల కథనాలు

ట్రోలింగ్ కాటుకు గరవటం వల్ల తాము తమ కుటుంబాలు ఏవిధంగా మానసిక క్షోభకు గురవుతున్నాయో తెలియ జేస్తూ బాధితులు కలత చెందారు. ట్రోలింగ్ వేధింపులను తలచుకొని భావోద్వేగాలకు గురయ్యారు. అంతలోనే తేరుకొని తాము ఏవిధంగా ఎదుర్కొన్నారో వివరించారు.

కుటుంబం మొత్తానికి క్షోభ కలిగించారు బైరి నరేష్

నాస్తికోద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న తనను విపరీతంగా ట్రోల్ చేస్తుండటం వల్ల తనతో పాటు తన కుటుంబం మొత్తం క్షోభకు గురైందని ప్రముఖ నాస్తికోద్యమ నేత బైరి నరేష్ భావోద్వేగానికి గురయ్యాడు. స్కూల్లో తన కుమారుడితో మాట్లాడొద్దని, అతడి స్నేహితుల తల్లిదండ్రులు అనటంతో అభం, శుభం తెలియన తన కుమారుడు కలత చెందాడని చెప్పాడు. తమ కుటుంబంతో సొంత బంధువులూ మాట్లాడలేదన్నారు.

తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నా.. ఉదయభాను

సామాజిక మాధ్యమాల్లో తాను విపరీత వేధింపులకు గురవటంతో తీవ్ర డిప్రెషన్ స్థితికి చేరుకున్నానని, తన ఆరోగ్యం సైతం విపరీత ప్రభావం చూపిందని తన అవకాశాలపైన సైతం ప్రభావం చూపిందని ప్రముఖ యాంకర్ ఉదయభాను అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదాల స్థాయిలో ట్రోలింగ్ వాదం తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతోందన్నారు.

విపరీత క్షోభకు గురయ్యా.. తులసి చందు

సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌ల ఫలితంగా తను విపరీత మానసిక క్షోభకు గురయ్యానని ప్రముఖ జర్నలిస్టు తులసి చందు అన్నారు. రాయలేని భాషలో బూతులు తిడుతూ మానసికంగా హింసించటమే పనిగా పెట్టుకొనితన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారన్నారు. తనకు తన కుటుంబం పూర్తి మద్దతు ఉండటంతో సమస్యను ఎదుర్కొగలిగానన్నారు.

ట్రోలింగ్ ఆగడాలకు అడ్డుకట్ట పడాలి.. అరుణ గోగుల మండ

ట్రోలింగ్ ఆగడాలకు అడ్డుకట్ట పడక పోతుండటంతో బాధితుల సంఖ్య పెరుగుతోందని సామాజిక కార్యకర్త అరుణ గోగుల మండ అన్నారు. ట్రోలర్లు తనను నెలలతరబడి మానసికంగా వేధింపులకు గురిచేశారని అన్నారు. తాను ఏమాత్రం ఆత్మస్థైర్యంకోల్పోకుండా వారితో పోరాటం చేస్తున్నానని చెప్పారు.

ట్రోలింగ్ దాడితో తీవ్ర మనస్తాపం...మెర్సీ మార్గరేట్..

ట్రోలింగ్ దాడుల ఫలితంగా తీవ్ర మనస్తాపానికి గురయ్యానని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవయిత్రి మెర్సీ మార్గరేట్ అన్నారు. ఆన్‌లైన్‌లో కొందరు తన కవిత్వాన్ని తప్పుపడుతూ, కొందరు మూక దాడులకు పాల్పడ్డారని చెప్పారు. ఏది రాయాలో, ఏది రాయకూడదో ఎలా ప్రవర్తించాలో అనే విషయాల్లో తాను స్వేచ్ఛగా వ్యవహరిస్తుండటాన్ని సహించలేని కొందరు తమ ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు.

పలువురు ఎస్‌ఐలు బదిలీలు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 11: జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీచేస్తూ పోలీసు అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఖానాపురంహవేలి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా ఉన్న పోలరాజు ఖుషికుమార్‌ను ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్-2కు, భద్రాద్రి కొత్తగూడెం కొమరారం ఎస్‌ఐగా ఉన్న బి.గిరిధర్‌రెడ్డిని తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు, ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐగా ఉన్న తోటనాగరాజును నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు, సీఎస్‌బి ఖమ్మం ఎస్‌ఐగా ఉన్న ఏ.కిరణ్‌కుమార్‌ను కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు, భద్రాద్రి కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐగా ఉన్న పి.సంతోష్‌ను ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌కు, నేలకొండపల్లి ఎస్‌ఐగా ఉన్న బాలగాని సతీష్‌ను ఖమ్మం త్రీటౌన్‌కు, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐగా ఉన్న వి.సురేష్ ను ఖమ్మం రూరల్ ఎస్‌ఐ-1 గా, టాస్క్‌ఫోర్స్‌లో మరో ఎస్‌ఐ గా ఉన్న వంశీకృష్ణను ఖమ్మం టు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, తిరుమలాయపాలెం ఎస్‌ఐగా ఉన్న వరాల శ్రీనివాసును వీఆర్ ఖమ్మానికి, కూసుమంచి ఎస్‌ఐగా ఉన్న సేనపతి శ్రీకాంత్‌ను వీఆర్ ఖమ్మానికి, ఖమ్మం రూరల్ ఎస్‌ఐ-2 గా ఉన్న యాకోబును వీఆర్ ఖమ్మానికి, ఖమ్మం త్రీటౌన్ ఎస్‌ఐగా ఉన్న ప్రభుదాస్‌ను వీఆర్ ఖమ్మానికి బదిలీచేస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్ వదంతులను నమ్మొద్దు: సీఐ ఉదయ్‌కుమార్

ఖమ్మం క్రైం ఫిబ్రవరి 11: పోలీసు అదుపులో చిన్న పిల్లల కిడ్నాప్ ముఠా అంటూ వస్తున్న వదంతులు నమ్మవద్దని ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ ఆదివారం ఇక ప్రకటనలో తెలిపారు. కొంతమంది అసత్య ప్రచారాలను పోస్ట్ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇలాంటి పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌చేస్తూ అలజడి సృష్టించే ప్రయత్నంచేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రామాలయ అభివృద్ధిపై ఈవో రమాదేవి మార్క్

- గరిష్ఠంగా పెరిగిన భద్రాద్రి దేవస్థానం ఆదాయం
- 2022లో రూ.28కోట్ల ఆదాయం
- 2023లో రూ.42 కోట్లు దాటిన రాబడి

భద్రాచలం, ఫిబ్రవరి 11: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆదాయం గత ఏడాది కాలంలో గరిష్ఠంగా పెరిగింది. 2023 ఫిబ్రవరి 16న భద్రాది దేవస్థానం ఈవోగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన అనంతరం తనదైన శైలిలో ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. కరోనా అనంతరం దేవస్థానం ఆదాయం కొంతమేర మాత్రమే ఉండగా, ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రమాదేవి తనదైన శైలిలో ఆలయ అభివృద్ధిలో మార్పు చూపించారు.

దేవస్థానానికి 2022లో రూ.28,70,35,626.15 ఆదాయం రాగా 2023లో రూ.42, 22,69,447.15 ఆదాయం వచ్చింది. దీంతో 2022తో పోల్చి 2023లో దేవస్థానానికి రూ.13,52,33,821 ఆదాయం పెరగడం విశేషం. ఈఏడాది జనవరి నెలలోనే దేవస్థానం ఆదా యం రూ.5కోట్ల8లక్షల 19వేల260 రూపాయాల వచ్చింది. 2022లో ల్యాండ్, షాపుల లీజుల ద్వారా రూ.2,05,89,719.48 ఆదాయం రాగా 2023లో రూ.5,29,40,781.32 రావడం జరిగింది. 2022లో వసతి గృహాల ద్వారా రూ.57,85,285 ఆదాయం రాగా 2023లో రూ.92,07,972 ఆదాయం సమకూరడం విశేషం. ఈ విధంగా దేవస్థానంలోని 11 విభాగాల్లో ఆదాయం గతంతో పోలిస్తే భారీ ఎత్తున ఆదాయం సమకూరింది. ఈవో గత ఏడాది కాలంలో పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖ పరంగా చర్యలు తీసుకున్నారు.



ఈవో రమాదేవి

ముఖ్యంగా భద్రాద్రి దేవస్థానానికి చెందిన ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న రామయ్య భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపడుతున్నారు. దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీ గోకులం నిర్మాణంలో భాగంగా గోశాలను మరింత అభివృద్ధి చేస్తున్నారు.

ఆంగ్లంలో అర్థమయ్యేలా బోధించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్

బూర్గంపాడు, ఫిబ్రవరి 11: గిరిజన విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఆంగ్లంలో పాఠ్యాంశాలు బోధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అన్నారు. ఆదివారం సారపాకలోని బీపీఎల్ జూనియర్ కళాశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రతీ వారం 20 మంది ఉపాధ్యాయులకు నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యా బోధన, మాట్లాడుకునే విధానం, నైపుణ్యాలపై శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఐటీడీఏ పీవో ప్రతిక్ జైన్ పలు సూచనలు చేశారు. ప్రతి ఆదివారం ఇంగ్లీషు పాఠశాలలుగా మార్చిన బడుల టీచర్లను ప్రభావవంతమైన శిక్షణ ఇవ్వాలన్నారు. గిరిజన విద్యార్థులకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న బీపీఎల్ ప్రిన్సిపాల్, లెక్చరర్లకు అభినందించారు.

పైనంపల్లి, రాయగూడెం గ్రామాలను

సందర్శించిన డీఎంహెచ్‌వో

- ఇంటింటి సర్వే... జ్వర పీడితులను నేలకొండపల్లి తరలింపు
- జ్వరాలు అదుపులోనే ఉన్నాయి..

నేలకొండపల్లి, ఫిబ్రవరి 11:ఖమ్మం ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రామునాయక్ ఆదివారం రాయగూడెం, పైనంపల్లి గ్రామాలను సందర్శించారు. పైనంపల్లిలో వైద్యశిబిరంతో పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వరాలతో అల్లాడుతున్న పల్లె జనం, రాయగూడెం, పైనంపల్లి గ్రామాల్లో ఉధృతం శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన సంగతి పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో ఆదివారం రాయగూడెం, పైనంపల్లి గ్రామాలను వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. పైనంపల్లి గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులను పరీక్షించారు. ఇంటింటి సర్వేలో 35మంది జ్వరాలతో ఉన్న వారిని గుర్తించి, అందులో ఐదుగురికి జ్వరంతోపాటు కీళ్ల నొప్పులు ఉండటంతో వారిని నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు. రాయగూడెంలో జరిపిన సర్వేలో 30మంది జ్వరంతో బాధ పడేవారిని గుర్తించారు. ఐదుగురికి జ్వర తీవ్రత ఎక్కువగా ఉండటంతో నేలకొండపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సిందిగా సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో రామునాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటు జ్వరాలు వస్తాయన్నారు. నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలలో స్పెషలిస్టు వైద్యులే ఉన్నారని, జ్వరాలు ఇతరత్రా బాధపడేవారు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. ప్రస్తుతం వచ్చింది వైరల్ ఫీవర్స్ అని ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. రెండు గ్రామాల్లో మూడు రోజుల పాటు వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి లక్ష్మీనారాయణ, నేలకొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, హెచ్‌ఈవోలు వీరన్న, చంద్రశేఖరరావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



పైనంపల్లిలో ఇంటింటి సర్వేలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో

పైనంపల్లిలో జ్వరంతో వ్యక్తి మృతి

నేలకొండపల్లి, ఫిబ్రవరి 11: మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఓ వ్యక్తి జ్వరంతో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పారపు నాగయ్య (63) 10 రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నాడని సమాచారం. మృతుడితోపాటు, ఆయన భార్య, కొడుకు, కోడలు సైతం జ్వరంతో బాధపడ్డారని తెలుస్తోంది. వారికి కొంత తగ్గుముఖం పట్టినా, నాగయ్య మూడు రోజులుగా మంచంలోనే ఉన్నాడని, ఆదివారం ఉదయం నాగయ్య మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం పైనంపల్లి గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో సైతం మృతుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నట్టు సమాచారం. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పైనంపల్లిలో జ్వరాలు ఉధృతంగా ఉన్నాయని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన సంగతి విధితమే. జ్వరాలు ఉధృతంగా ఉన్నా.. వైద్య సిబ్బంది మాత్రం జ్వరాలు అంతగా లేవని లేనట్టుగా చెప్పటానికి ప్రయత్నిస్తున్నట్లు ఈ సంఘటనను బట్టి తెలుస్తున్నది.

మైనింగ్ శాఖ దాడులు

- మూడు మట్టి టిప్పర్లు స్వాధీనం
- అయినా ఆగని మట్టి అక్రమ తవ్వకాలు

సత్తుపల్లి, ఫిబ్రవరి 11: సత్తుపల్లి మండలంలో నిత్యం వేలాది క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం మైనింగ్ శాఖ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్థానిక ఆర్టీసీ డిపోలో ఉంచారు. వీటికి సంబంధించి వివరాల కోసం ప్రయత్నించగా సదరు సిబ్బంది ఎవరూ ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడ దాడులు నిర్వహించేది.. ఎన్ని వాహనాలు సీజ్ చేసింది.. మట్టి తవ్వుతున్న ఎక్సవేటర్ ఏమైంది తదితర వివరాల కోసం అధికారులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఒక పక్క దాడులు.. మరోపక్క అక్రమ తవ్వకాలు

సత్తుపల్లి మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా, అక్రమ వ్యాపారానికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఆదివారం మైనింగ్ ఉద్యోగులు దాడులు నిర్వహించారు. అధికారులు సత్తుపల్లి-రేజర్ల మధ్యలో మట్టి లోడ్‌తో వస్తున్న టిప్పర్లు మూడింటిని స్వాధీనం చేసుకోగలిగారు. కానీ రేజర్ల, కొమ్మేపల్లి, కొత్తూరు ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్లు, రవాణా చేస్తున్న వాహనాల సమాచారం సంబంధిత శాఖకు తెలియకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓ పక్క దాడులు జరుగుతున్నా మరోపక్క నిర్భయంగా అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది.



సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో మైనింగ్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు

ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళ మృతి

అశ్వారావుపేట, ఫిబ్రవరి, 11 : ద్విచక్రవాహనంపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మహిళ మృతి చెందిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం గంపలగూడెం గ్రామం వద్ద ఆదివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట పరిధిలో దొంతికుంట గ్రామానికి చెందిన పచ్చినీల జ్యోతి (37) తన భర్తతో ద్విచక్రవాహనంపై ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట వస్తుండగా గంపలగూడెం సమీపంలో ద్విచక్రవాహనంపైనుంచి ప్రమాధవశాత్తు జారి పడింది. తలకు దెబ్బతగలటంతో స్పృహతప్పి పడిపోయింది. వెంటనే 108లో అశ్వారావుపేట వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు పరీశీలించి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. జీలుగుమల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జ్యోతి

కోడిపందాల స్థావరంపై

పోలీసుల దాడి

ఆరుగురిపై కేసు నమోదు

దమ్మపేట, ఫిబ్రవరి, 11: కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన కొమ్ముగూడెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమ్ముగూడెం గ్రామ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,680లు, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ రెహమాన్

చుంచుపల్లి, ఫిబ్రవరి 11: చుంచుపల్లి మండలంలో గంజాయి తాగుతున్న యువకులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో గడ్డం ప్రవీణ్‌కుమార్, విద్యానగర్ కాలనీలోని చింతలచెరువు కట్ట మీద కొంతమంది యువకులు గంజాయి తాగుతున్నారని సమాచారం మేరకు అక్కడికి వెళ్లి ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. పది మంది యువకులు పరారయ్యారు. అరెస్టు అయిన వారిలో దొమ్మేటి మధు, గొల్లపల్లి మోహన్, షేక్ హసన్, ఇరిగదిండ్ల రాహుల్, బొంకూరి రోహిత్, సాయిభరత్, వీరేందర్‌లు ఉన్నారు. వీరు కొంత కాలం నుంచి సీలేరు ప్రాంతమైన డొంకరాయికి వెళ్లి గంజాయిని తెచ్చి యువకులకు అమ్ముతున్నారు. వీరి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లు, 5.5 కేజీల గంజాయి వీటి మార్కెట్ విలువ రూ.1.32 లక్షలు ఉంటుందని తెలిపారు.

బాలికపట్ల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుడి అసభ్యప్రవర్తన

కొణిజర్ల, ఫిబ్రవరి 11: ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని ఓ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు అదే పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జరిగిన ఈ ఘటనపై విచారణ నిర్వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ శనివారం సదరు ఉపాధాయుడిని విధులనుంచి తొలగించి కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ట్రైకార్ లోన్‌లో జూనియర్ అసిస్టెంట్ చేతివాటం

లబ్దిదారుడి నుంచి రూ.5వేలు యూపీఐ యాప్ ద్వారా బదిలీ

కామేపల్లి, ఫిబ్రవరి 11: ట్రైకార్ లోన్ లబ్దిదారుల నుంచి జూనియర్ అసిస్టెంట్ రాజు చేతివాటం ప్రదర్శించాడు. కామేపల్లి మండలంలో 2020-21ఆర్థిక సంవత్సరంలో ట్రైకార్ రుణాలకు 45మంది గిరిజన లబ్దిదారులను ఎంపిక చేశారు. అందులో భాగంగా ఇటీవల ఆ ట్రైకార్ లోన్లు మంజూరు అయ్యాయి. మంజూరైన ఒకొక్క లబ్దిదారుడి నుంచి రూ.5వేలు ఖర్చులు అయ్యాయని డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ లబ్దిదారుడి నుంచి రూ.5వేలు యూపీఐ యాప్ ద్వారా జూనియర్ అసిస్టెంట్ రాజు ఖాతాకు బదిలీ చేసుకున్నాడని బాధితుడు ఆరోపిస్తున్నాడు. బదిలీకి సంబంధించి వివరాలను లబ్దిదారుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. ఆ సంఘటనపై జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు డిమాండ్ చేస్తున్నారు.

దేవుడు వెలిశాడంటూ గ్రామస్థుల పూజలు

బండరాయికి దేవుని రూపాలున్నట్లు గుర్తింపు

ముదిగొండ, ఫిబ్రవరి 11: ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామ సమీపంలో దేవుడు వెలిశాడంటూ గ్రామస్థులు ఆదివారం తవ్వకాలు జరిపి ఓ శిలను వెలికితీసి పూజలు చేశారు. గ్రామానికి చెందిన బుద్దారపు శ్రీనివాస్ అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఒకరోజు రాత్రి వేళ గ్రామానికి వెళ్తుండగా గ్రామసమీపంలో రోడ్డు పక్కన ఉన్న పొదల్లో దేవుడు ప్రత్యక్షమైనట్లు అనిపించడంతో గ్రామస్థులకు తెలిపాడు. గ్రామస్థులు నమ్మకపోవడంతో అతు ఒక్కడే కొంతమంది గ్రామస్థులతో కలిసి ముక్కోటి ఏకాదశి రోజున అక్కడ కొద్దిమేర తవ్వకాలు చేపట్టి వదిలేశాడు. ఆనాటి నుంచి గ్రామంలో జరిగిన కొన్ని శుభకార్యాలలో కొంత మంది మహిళలు దేవుడు పూనినట్లు ఊగిపోతూ సదరు ఆటో డ్రైవర్ చెప్పినచోట తాను ఉన్నానని, తనను ఎవ్వరూ గుర్తించడం లేదని వాక్కు చెప్పడంతో గ్రామస్థులంతా చర్చించుకొని తవ్వకాలు జరిపేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఆటో డ్రైవర్ శ్రీనివాస్ సూచించిన ఆ ప్రదేశంలో కొంతమంది గ్రామస్థులు పూజారితో పూజలు నిర్వహించి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేశారు. 12అడుగుల మేర తవ్వకాలు జరిపిన తరువాత ఒక బండరాయికి మీసాల లక్ష్మీనర్సింహస్వామి, వెంకటేశ్వరస్వామి అవతారం రూపాలు కనిపించడంతో పూజారులు పూజలు నిర్వహించారు. గ్రామస్థులంతా అక్కడికి చేరుకొని స్వామి వెలిశాడని నమ్మకంతో పూజలు నిర్వహించడంతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది.



తవ్వకాలు జరుపుతున్న దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న పూజారి, గ్రామస్థులు



పడిపోతున్న నీటిమట్టం

పాతాళానికి జలం

- పడిపోతున్న భూగర్భ నీటిమట్టం
- ఎండుతున్న చెరువులు, బావులు
- తిరుమలాయపాలెం, ముదిగొండ, కామేపల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లో తీవ్రం
- భూగర్భజలాల పెంపునకు చర్యలు శూన్యం
- ఈ వేసవిలో తాగునీటికి తిప్పలు తప్పవ్..!

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11: సహజవనరులైన నింగి, నేల, నీటి స్వచ్ఛతపైనే జీవకోటి మనుగడ ఆధారపడి ఉంది. పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేస్తే ఎదురయ్యే దుష్ఫలితాలు ఎన్నో. ఆపరిస్థితులు రాకూడదనే ప్రభుత్వం 2002లో నీరు, భూమి, చెట్ల పరిరక్షణ చట్టం (వాల్టాచట్టం) ప్రవేశపెట్టింది. భూమిని రక్షించుకోవడం, భూగర్భజలాల పెంపు , చెట్లపెంపకాన్ని ప్రోత్సహించడం, జలకాలుష్య నివారణ తదితర లక్ష్యాలను వాల్టా చట్టంలో రూపొందించారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేని ధోరణి కారణంగా చట్టం అమలులో నీరుగారిపోతోంది. చట్టాలు సూచించిన మార్గదర్శకాలు ఎక్కడా అమలుకావడంలేదు. ఫలితంగా భూగర్భజలాలు అథఃపాతాళానికి పడిపోతున్నాయి. ప్రతీ సంవత్సరం సాగునీరు, తాగునీటికి ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

భూగర్భంలో ఉన్న జలాలను పైకితెప్పించడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించడంలేదు. అంతగా భూగర్భజలాలు పడిపోయాయి. చెరువులు ఎండిపోతున్నాయి.. కాలువల్లో నీళ్ల రబీ అవసరానికే సరిపోతుంది. బావులు అడుగంటుతున్నాయి. బోర్లు కూడా క్రమేణా మూలనపడుతున్నాయి. చేలల్లోఉన్న పంటలు.. మొక్కలు నీటి చుక్కల కోసం అర్రులు చాస్తున్నాయి. కరువే కాదు.. ఫిబ్రవరి నాటికే తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ వర్షపాతం లోటుగా నమోదైంది. దీంతో పంటలన్నీ నిలువునా ఎండిపోయాయి. ఎన్నడూ లేని విధంగా వర్షపాతం తగ్గడంతో భూగర్భజలాలు కూడా అడుగంటి పోతున్నాయి. 956.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 854.4 మిల్లీమీటర్లే కురిసింది. 10.3శాతం తక్కువగా నమోదైంది. ఆ ప్రభావంతో భూగర్భజలాలు మరింత అడుగంటుతున్నాయి. గత డిసెంబరు నాటికి జిల్లాలో 0.70 మీటర్లలోతులో ఉన్న జల మట్టం జనవరి నాటికి 1.00 మీటర్ల లోతుకు పడిపోయింది.



భూగర్భనీటిమట్టాన్ని కొలుస్తున్న అధికారులు

పడిపోతున్న భూగర్భ జలాలు

ఖమ్మం జిల్లాలో అధికారుల గణాంకాల ప్రకారం జనవరి చివరి నాటికి జలమట్టం తగ్గిపోతుంది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో రోజురోజుకీ భూగర్భజల మట్టం తగ్గిపోతున్నా తిరుమలాయపాలెం, ముదిగొండ, ఖమ్మం రూరల్, కామేపల్లి, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో భూగర్భజలాల అడుగంటి పోతుండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. 18 మండలాల్లో గత డిసెంబరు 23 నుంచి, జనవరి నెలకు గణనీయంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఖమ్మం అర్బన్ మండలంలో ఈ డిసెంబరు నాటికి 1.14 మీటర్లలోతున జలాలు ఉండగా ప్రస్తుతం 1.32 కి పడిపోయాయి. ఖమ్మం రూరల్ మండలంలో 3.65 ఉండగా 4 మీటర్లకు పడిపోయింది. తిరుమలాయపాలెం మండలంలో 3.45 ఉండగా 3.55కి, కూసుమంచిలో 4.30ఉండగా 5.14కి పడిపోయింది. నేలకొండపల్లిలో 2.68కిగాను 2.77కు, బోనకల్ మండలంలో 1.58కిగాను 2.56కు పడిపోయింది. చింతకాని మండలంలో 3.53కి గాను 4.67కు, ముదిగొండ 3.03కుగాను 2.65కు, కొణిజర్లలో 2.00కు గాను 2.16, సింగరేణిలో 4.59కుగాను 6.60, కామేపల్లి మండలంలో 7.92కు గాను 8.51, మధిర మండలంలో 4.28కు గాను 6.08కి పడిపోయింది. ఎర్రుపాలెం మండలంలో 5.66కుగాను 7.89కు, వైరా 1.77కిగాను 1.82కు పడిపోయింది. రఘునాథపాలెంలో 4.83 మీటర్లు ఉండగా 5.97కు పడిపోయింది. సత్తుపల్లిలో 16.17కు గాను 16.89కి, వేంసూరులో 4.84కుగాను 5.56కి పడిపోయింది. పెనుబల్లిలో 4.68కిగాను 5.25కు పడిపోయింది. కల్లూరులో 2.86కు గాను 2.81కు, తల్లాడలో 3.13కుగాను 3.92, ఏన్కూరులో 7.86కుగాను 8.47 మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. ఫిబ్రవరిలోనే ఈ పరిస్థితి ఉంటే భవిష్యత్తులో పరిస్థితి ఏంటనే విషయమై జిల్లా వాసులను మరింత ఆందోళనకు గురిచేస్తుంది.

18 మంది ఎంపీడీవోలు బదిలీ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలను బదిలీచేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన 18మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యా రు. ఖమ్మం నుంచి బదిలీ అయిన ఎంపీడీవోల వివరాలు ఇలా ఉన్నాయి.. సీహెచ్ సుభాషిణి, ధారావత్ శ్రీనివాసరావు, బెక్కంటి శ్రీనివాసరావు, బి.వేణుమాధవ్, బానోత్ రవికుమార్, షేక్ షైలార్ సహాబ్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. బానోత్ జయరాంను సిద్దిపేటకు, బయ్యవరపు అశోక్, తాళ్లూరి శ్రీనివాసరావు, కె.విజయభాస్కర్‌రెడ్డి, బి.రవీంధర్‌రెడ్డి, కె.మహాలక్ష్మి, ఆర్.రమాదేవి, వాసిరెడ్డి దుర్గావెంకట అశోక్‌కుమార్, కె. జమలారెడ్డి, ఆర్.రామకృష్ణ, ఎం.చంద్రశేఖర్, డి.కరుణాకర్‌రెడ్డి వీరిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు.

కవి యాత్రలో ఖమ్మం కవులకు సన్మానం

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 11: కోదాడ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ జిల్లా కోదాడ నుంచి నడిగూడెం వరకు కవి యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా డాక్రి కోటలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఖమ్మం కవులు సాధనాల వెంకటస్వామి నాయుడు, కట్టికోల చిన్న నరసయ్య, సీత్లా నాయక్, తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ముగిసిన త్రిశూల్ దీక్ష

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 11: విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన త్రిశూల్ దీక్ష ఆదివారం ముగిసింది. దీక్షలో దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాంత సంఘటన మంత్రి ముదుప యాదిరెడ్డి పాల్గొని మాట్లాడారు.

హిందూ సంస్కృతి,సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పల్లె పట్నం రామరాజ్యంగా విలుసిల్లుతోందని రామ మందిరంతో అది రుజువుఅయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు నేరేళ్ల శ్రీనివాస్, బోనాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 11: స్వర సుధ కల్చరల్స్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తరామదాసుకళాక్షేత్రంలో నిర్వహించిన సంగీత విభావరి సంగీతాభిమానులను అలరించింది. ఘంటసాల 50వ వర్ధంతి, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సంగీత విభావరిలో ప్రముఖ గాయనీగాయకులు పలు చిత్రాల్లోని పాటలను పాడి ఆకట్టుకున్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సోషల్ వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ

వైరా, ఫిబ్రవరి 11: మార్చిలో జరిగే పదోతరగతి పరీక్షల్లో ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ ఖమ్మం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ సూచించారు. వైరా ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సంబరాలను నిర్వహించారు. డీడీ కస్తాల సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ వసతి గృహాల్లో ఉంటూ పదోతరగతి చదివిన విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఎస్‌సీడీవో కొత్తా వెంకటేశ్వరరావు, వసతి గృహ సంక్షేమ అధికారి తేజావత్ దశరథ్ పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పులతో క్యాన్సర్

సత్తుపల్లి, ఫిబ్రవరి 11: జీవన విధానంలో మార్పులు, మానసిక ఒత్తిడి, ఆహారంలో కాలుష్యం, గుట్కా, పాన్ మసాలాల వినియోగం క్యాన్సర్‌కు కారణంఅవుతున్నాయని ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఆంకాలజీ వైద్యుడిజీ రవిశంకర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి, చేతన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా సుమారు 400మందిని పరీక్షించగా కేవలం ముగ్గురికి మాత్రమే క్యాన్సర్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి రంగారావు, దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేష్, గుండు శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకరరావు, గండ్ర సోమిరెడ్డి, మందపాటి ప్రభాకరరెడ్డి, జంగా సత్యనారాయణ, రమ, జయ, హరిబాబు, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు రవిశంకర్





సౌర పుష్పం

తూరుపు కొండల మాటు నుంచి తొంగి చూడాల్సిన సూరీడు విద్యుత్ స్తంభానికి విరబూసాడు.. ఆకాశంలో అటు నుంచి ఇటు ఎగబాకాల్సిన పొద్దు డివైడర్ పోల్‌పైన కాంతులీనింది.. కూసుమంచి ప్రధాన రహదారిలో ఉదయాన్నే కనిపించిన ప్రకృతి చిత్రాన్ని ఆంధ్రజ్యోతి 'క్లిక్'మనిపించింది. -కూసుమంచి

న్యూరో వైద్యుడికి అబ్దుల్‌కలాం అవార్డు



డాక్టర్ సురేష్‌ను సన్మానిస్తున్న యాక్ట్‌నౌ సంస్థ ప్రతినిధులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11: ఖమ్మం కిమ్స్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ న్యూరో వైద్యుడు డాక్టర్ గట్టినేని సురేష్‌కు ఏపీజే అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్సీ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 'యాక్ట్ నౌ ఆర్గనైజేషన్' ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం జరిగింది. ప్రతీ సంవత్సరం వైద్య వృత్తిలో ఉన్నత సేవలు అందించిన వారికి ఈ అవార్డును అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ కెఎస్ పాల్గొన్నారు.

ప్రజా భవనం ప్రజలపరం



ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి11: ఎలాంటి అనుమతులు లేకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధి నిర్మించిన భవనాన్ని ప్రజల పరం చేయాలనే డిమాండ్, ఫిర్యాదుల మేరకు అధికారులు చర్యలు చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇల్లెందు పట్టణంలోని జేకే ఏరియా సింగరేణి నిర్వాసిత కాలనీలో రెండేళ్ల క్రితం ప్రస్తుత మాజీ ప్రజాప్రతినిధి సింగరేణి నిర్వాసితులకు కేటాయించిన ఒకటి, రెండో ప్లాట్లను ఆక్రమించుకొని భవనాన్ని నిర్మించారు. మూడు అంతస్తుల్లో చేపట్టిన ఈ నిర్మాణంపై అప్పట్లో పలు ఆరోపణలు వచ్చినప్పటికి అధికారులు పట్టించుకోలేదు. అటు సింగరేణి, ఇటు మున్సిపాలిటీల అనుమతులు లేకుండానే నిర్మాణాన్ని పూర్తి చేయడం అనంతరం ప్రజాభవనంగా నామకరణం చేసి పలు కార్యక్రమాలు ఈ భవనంలోనే నిర్వహించారు. ఇటీవల జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఓసీ నిర్వాసిత ప్రాంత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వాసితులు ఈ ప్రజా భవనాన్ని తమకు అప్పగించాలని విన్నవించారు. అనుమతి లేని భవనాన్ని ప్రజల పరం చేయాలా.. నిర్వాసిత కాలనీ వాసులకు అప్పగించాలా.. అనే ఆలోచనలకు అధికారులు వచ్చినట్లు సమాచారం.

గ్రూప్-4లో విజయం సాధించిన అనూష



దమ్మపేట, ఫిబ్రవరి 11: గట్టుగూడెం గ్రామానికి చెందిన నల్లబోతుల అనూష గ్రూప్ 4ఫలితాలలో ఎస్టీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు, భద్రాద్రి జిల్లా జిల్లాలో జనరల్ విభాగంలో 52వ ర్యాంకు సాధించింది. రాష్ట్ర స్థాయిలో 2,228 సాధించి ఉద్యోగాన్ని పొందింది. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి మెయిన్స్‌కు అర్హత సాధించింది. అనంతరం ఆపరీక్షలు రద్దయ్యాయి. గ్రూప్-1తో పాటు గ్రూప్-4 పరీక్షలు రాయగా ఉద్యోగం వరించింది. అనూష తండ్రి ముద్దులగూడెం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. అనూష గట్టుగూడెం, గంగారం ప్రభుత్వ పాఠశాలలో చదివి అనంతరం నూజివీడుతో (ఐఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది. గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించాలని లక్ష్యమని అనూష తెలిపింది. అనూషను పలువురు అభినందించారు.

ఉత్సాహంగా డాక్టర్స్ క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఆదివారం నాలుగు జిల్లాల స్థాయి డాక్టర్స్ క్రికెట్ టోర్నీని ఉత్సాహంగా నిర్వహించారు. టోర్నీలో ఆతిథ్య ఖమ్మంతో పాటు, నల్గొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాల నుంచి డాక్టర్ల జట్లు పాల్గొన్నాయి. తెలిపారు. పోటీలను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వైద్య వృత్తిలో బిజీగా ఉండే డాక్టర్లు అప్పుడప్పుడూ ఆటలు ఆడటం ద్వారా మానసిక ప్రశాంతతను పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు స్లైజర్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు సంతోష్, నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కల్లూరు/ ఏన్కూరు, ఫిబ్రవరి 11: కల్లూరు, ఏన్కూరు మండల కేంద్రాల్లో ఆదివారం 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ షాకీర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపార్టమెంటల్ అధికారిగా డి. సురేష్‌కుమార్, సిట్టింగ్ స్కాడ్‌గా బి. మంజుల పరీక్షను పర్యవేక్షించారు. ఈ పరీక్ష కేంద్రానికి గాను 384 మంది బాలబాలికలను కేటాయించగా అందులో 191 మంది బాలికలు, 166 మంది బాలురు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఏన్కూరులో మొత్తం 288విద్యార్థులకు గాను 277మంది హాజరయ్యారు. చీఫ్ సూపరెండెంట్‌గా టి.శ్రీనివాస్ రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా కావూరి పద్మ, సిట్టింగ్ స్కాండ్‌గా షేక్ యాకూబ్ పాషా పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరకుండా ఎస్ఐ బాధవత్ రవి నేతృత్వంలో 144 సెక్షన్ విధించి బందోబస్తును పర్యవేక్షించారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

భద్రాద్రి డీఎంహెచ్‌వో డిప్యూటేషన్‌ను రద్దుచేయాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్



మాట్లాడుతున్న దశరథ్

పెనుబల్లి, ఫిబ్రవరి 11: రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటేషన్లను రద్దుచేసిన ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంహెచ్‌వో డిప్యుటేషన్‌ను రద్దుచేయకపోవడం వెనుక అంతర్యమేమిటని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్ ప్రశ్నించారు. ఆదివారం పెనుబల్లిలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వైద్యఆరోగ్యశాఖలో 66వ జీవోను రద్దుచేయాలని, భద్రాద్రి జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో ట్రైబల్ శాఖలో గత ఏడాది జనవరి 13న చేపట్టిన స్టాఫ్‌నర్సు నియామకాలపై విచారణ చేపట్టాలన్నారు. 19న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్టీ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిందని తెలిపారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు పండునాయక్, రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణనాయక్, కల్లూరు, తల్లాడ మండలాల అధ్యక్షులు నందూనాయక్, రవినాయక్, ధర్మావత్ మంగూ, రమేష్ పాల్గొన్నారు.

22 నుంచి ఖమ్మం ప్రీమియర్ లీగ్



క్రికెట్ పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11: ఈనెల 22 నుంచి మార్చి 1వ తేదీ వరకు నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఖమ్మం ప్రీమియర్ లీగ్ టీ- 20 క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆదివారం పోటీల అఫీషియల్ లోగోను, ప్రీ లాంచ్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, నరేష్, మోహన్, వెంకటప్రసాద్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'కస్తూర్బా'ల్లో రెండు నెలలుగా అందని వేతనాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 11: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు అన్నారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టటం తగదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 11: మండల పరిధి పర్ణశాల క్రాస్‌రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భద్రాచలానికి చెందిన వారు ఆటోలో పర్ణశాల రాముని దర్శించుకొని ఇంటికి తిరుగుముఖం పట్టారు. వీరి ఆటోను వెంకటాపురానికి చెందిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి వెళ్లి తగలడంతో ఆ తీవ్రతకు స్తంభం విరిగిపోయింది. ఆటో నడుపుతున్న భద్రాచలం వాసి అబ్రహం తీవ్రంగా గాయపడగా, నాగేంద్ర కాలికి గాయమైంది. క్షతగాత్రులను తొలుత ములకపాడు పీహెచ్‌సీకు, అనంతరం మెరుగైన చికిత్సల కోసం భద్రాచలం తరలించారు. ఆటో యజమాని, డ్రైవరు అయిన అబ్రహం తన కుటుంబ సభ్యులతో కలిసి పర్ణశాల రాముని దర్శించుకొని వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

మధిర రూరల్, ఫిబ్రవరి 11: మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న గుగులోతు వెంకన్న(58) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఖమ్మానికి చెందిన వెంకన్న మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆన్ డ్యూటీలో ఉన్న ఆయన ఆదివారం ఖమ్మంలోని తన నివాసంలో ఉన్నాడు. రాత్రి 8గంటల సమయంలో ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందారు. వెంకన్న భార్య, పిల్లలున్నారు. ఇతడి మృతితో కుటుంబసభ్యులతో పాటు రూరల్ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది విషాదంలో మునిగిపోయారు.

చెరువులోపడి యువకుడి మృతి

తిరుమలాయపాలెం ఫిబ్రవరి11: చెరువులోపడి యువకుడు మృదిచెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన మాళోతు నరేష్ (21) మేకల కాపరిగా పనిచేస్తున్నాడు. తన మానసికపరిస్థితి బాగోలేదు. తండా సమీపంలోవున్న సుబ్లేడు చెరువులోకి ఇతరులతో కలిసి ఈతకు వెళ్లాడు. నరేష్‌కు ఈత రాకపోవటంతో చెరువులో నీట మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందాడని తెలిపారు. దీంతో నరేష్ తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కస్తూర్బా'ల్లో అందని వేతనాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 11: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు అన్నారు.

100 పడకల ఆసుపత్రికి స్థల సేకరణ

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- వైరాలో ఇప్పటికే సమీక్షించిన డిప్యూటీ సీఎం

వైరా, ఫిబ్రవరి 11: వైరాలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన ఐదెకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు సేకరించి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. గత ఏడాది జూలై 27న వైరాకు రూ.37.50కోట్లతో వంద పడకల ఆసుపత్రిని అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఆతర్వాత ఎన్నికలకు ముందు ఈ ఆసుపత్రికి దాదాపు 96పోస్టులను కూడా మంజూరు చేసింది. కొద్ది కాలానికే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ వందపడకల ఆసుపత్రి మంజూరు ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం స్టాఫ్‌నర్సులకు పోస్టింగ్‌లు ఇచ్చి వైరాకు 8నుంచి10 స్టాఫ్‌నర్సు పోస్టులను కూడా మంజూరు చేసినట్లు సమాచారం.

గత ప్రభుత్వంలో తాజా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ విజ్ఞప్తి మేరకు అప్పటి వైద్యఆరోగ్యశాఖ మంత్రి టి.హరీష్‌రావు వైరాకు వందపడకల ఆసుపత్రిని కేటాయించి పోస్టులను మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఆసుపత్రి మంజూరు విషయమై 'ఆంధ్రజ్యోతి' ఒక కథనాన్ని ప్రచురించింది. దాంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ వందపడకల ఆసుపత్రి విషయంపై దృష్టిసారించారు.

వైద్యవిధాన పరిషత్ అధికారుల విజ్ఞప్తి మేరకు వందపడకల ఆసుపత్రికి అవసరమైన స్థలాన్ని సమకూర్చటానికి రెవెన్యూశాఖ నడుంబిగించింది. ప్రస్తుతం పది పడకలతో ఉన్న వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేవలం రెండెకరాల స్థలం మాత్రమే మిగిలింది. మూడున్నర ఎకరాల స్థలం కబ్జాలు, ఆక్రమణలకు గురైంది. వందపడకల ఆసుపత్రిని నిర్మించేందుకు కనీసం ఐదెకరాలకు పైగా స్థలం కావల్సి ఉంది. రెవెన్యూ అధికారులు పీహెచ్‌సీకి చెందిన ప్రస్తుత స్థలాన్ని సర్వే చేశారు. ఆక్రమణదారులకు నోటీసులు కూడా జారీ చేశారు. ఈ ఆక్రమణల వ్యవహారం ఇప్పటికిప్పుడే పరిష్కారమయ్యే అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లోని స్థలాల సేకరణకు రెవెన్యూశాఖ పూనుకుంది.

పశుగణాభివృద్ధి సంస్థకు చెందిన స్థలాన్ని, ఎన్నెస్పీకి చెందిన స్థలాలను రెవెన్యూశాఖ పరిశీలించి సర్వే చేసినప్పటికీ అవి అంత అనుకూలంగా లేవు. దాంతో గత ప్రభుత్వ హయాంలో జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ ఆదేశాల మేరకు నిరుపయోగంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు చెందిన ఐదెకరాల స్థలాన్ని మినీ స్టేడియం నిర్మాణం కోసం రెవెన్యూశాఖ సేకరించి మునిసిపాలిటీకి అప్పగించింది. మినీ స్టేడియానికి రూ.65లక్షలు మంజూరైనా నిధులు విడుదల కాలేదు. నిరుపయోగంగా ఉన్న స్థలంలోని కంపచెట్లను తొలగించి క్రీడా ప్రాంగణ బోర్డులు మాత్రమే ఏర్పాటుచేశారు.

వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు నుంచి మినీ స్టేడియానికి 40అడుగులతో రోడ్డు నిర్మించేందుకు రాజశేఖర్ నగర్‌లోని రోడ్డుపక్కన నివాసాల వారి ప్రహరీగోడలు కూడా మునిసిపాలిటీ వారు అప్పట్లోనే కూల్చివేశారు. తర్వాత మినీ స్టేడియం నిర్మాణం, రోడ్డు వెడల్పు అతీగతీ లేకుండాపోయింది. ఈ పరిస్థితుల్లో మినీ స్టేడియానికి కేటాయించిన ఐదెకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదించగా ఆయన ఓకే చేశారు.

ఈనెల ఏడున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కూడా తహసీల్దార్ శ్రీనివాసరావుతో వందపడకల ఆసుపత్రికి అవసరమైన స్థలం గురించి సమీక్షించారు. ఈ స్థలం గురించి తహసీల్దార్ వివరించారు. ఈ ఆసుపత్రికి వెళ్లేందుకు కనీసం 60అడుగులతో రోడ్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా డిప్యూటీ సీఎం తహసీల్దార్‌ను ఆదేశించారు. వైరా నుంచి తల్లాడ వెళ్లే జాతీయ ప్రధాన రహదారిలో తహసీల్దార్-ఎంపీఐ కార్యాలయాల మధ్య గూండా లేక తహసీల్దార్-ఐఎంఎల్ డిపో మధ్య నుంచి లేని పక్షంలో మధిర-జగ్గయ్యపేట వెళ్లే రోడ్డు దగ్గరి నుంచి రాజశేఖర్‌నగర్ రోడ్డు గూండా 60అడుగుల వెడల్పుతో ఈ స్థలానికి రోడ్డును నిర్మించాల్సి ఉంది. మొత్తానికి వంద పడకల ఆసుపత్రికి అవసరమైన స్థల సేకరణ జరగడంతో నిర్మాణానికి అడ్డంకులు తొలిగినట్లయింది.



ఆసుపత్రికి సేకరించిన స్థలం

మధిరలో నేడు ప్రజావాణి: కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 11: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం మధిరలో నిర్వహించనున్నారు. జిల్లా ప్రజలకు సౌకర్యంగా కలెక్టర్ వీపీ గౌతమ్‌తో పాటు అధికార యంత్రాంగం మొత్తం ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకానున్నారు. మధిర పట్టణంలోనిరెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అక్కడి అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం 60 శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. మధిర నియోజకవర్గానికి చెందిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా ఉన్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అక్కడి ప్రజలతో పాటు జిల్లా ప్రజల సమస్యలను వినేందుకు వాటి పరిష్కారంకోసం ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం మధిరలో నిర్వహించనున్నారు. జిల్లా ప్రజలు గమనించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై రహదారి విస్తరించండి

- చాలీ చాలని వెడల్పుతో నిర్మాణం
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- డిజైన్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి అసంతృప్తి

మధిరటౌన్, ఫిబ్రవరి 11: మధిరలో ఎంతో ఆర్భాటంగా నిర్మించిన ట్యాంక్‌బండ్ ప్రజలు ఆశించిన ఫలితాలు ఇవ్వక పోవడంతో దానిపై ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్షించడంతో దాన్ని మరింత విస్తరించేందుకు సన్నాహాలు మొదలవుతునట్లే కనపడుతుంది. ఇటీవలే రూ.5.5కోట్లతో మధిర చెరువును ట్యాంక్‌బండ్‌గా విస్తరించి ప్రారంబోత్సవం చేశారు. కాని ట్యాంక్‌బండ్ మీదుగా పలు గ్రామాలకు ప్రజలు నిత్యం ప్రయాణించాల్సి రావడంతో రోడ్డు విస్తరణ కేవలం 20 అడుగుల వెడల్పుతో చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఆడుకునే పిల్లలను వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్యాంక్‌బండ్‌ను ఇరుకుగా నిర్మించారు ఇంకొంచెం వెడల్పుతో నిర్మిస్తే ఆహ్లాదంగా సేద తీరేందుకు బాగుండేదని ప్రజలు బావిస్తున్న తరుణంలో ఉప ముఖ్యమంత్రి భట్టి దీనిపై సమీక్షించి ట్యాంక్‌బండ్ కు అవతల గ్రామాలు ఉండటం వారు దీనిగుండానే ప్రయాణించాల్సి రావడంతో కేవలం 20 అడుగు వెడల్పుతో ఎలా నిర్మించారని అదికారులను ప్రశ్నించారు. డిజైన్‌పై భట్టి అసంతృప్తి వ్యక్తంచేశారు. డిజైన్ ట్యాంక్‌బండ్ మధిరకు ఒక ఎసెట్‌లా ఉండాలే కాని మొక్కుబడిగా నిర్మిస్తే ఎవరికి ఉపయోగం అని నిలదీసారు. ట్యాంక్‌బండ్‌ను కనీసం 60 నుంచి80 అడుగుల వెడల్పు ఉండేలా కట్టను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, మధ్యలో సెంట్రల్ లైటింగ్ తో రెండు వైపులా రోడ్లు నిర్మించాలని, వాకింగ్ ట్రాక్ కూడా మరింత వెడల్పు ఉండాలని సూచించారు. దీనితో భట్టి నిర్ణయంతో ట్యాంక్‌బండ్ విస్తరణ ఖాయమని తేలడంతో ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ తరహాలో మధిర లో కూడా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.




ట్యాంక్‌బండ్ పై పెరిగిన ముళ్లకంప, ఇరుకుగా ఉన్న రోడు

అస్తవ్యస్తంగా ట్యాంక్‌బండ్ నిర్మాణం

బెజవాడ రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి



మధిర చెరువు కట్టను నల్లమట్టి తో ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించారు. దానిపై అనేక ప్రభుత్వా లు రాకపోకలు సాగించేందుకు రోడ్లు నిర్మించినా నల్లమట్టి కట్ట కావడంతో అవి సంత్సరానికే కుంగి పోయేది. ట్యాంక్‌బండ్‌ను నిర్మించే సమయంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుక పోయినా పట్టించుకోలేదు. ప్రారంబించిన నెల రోజులకే సిమెంట్ రోడ్డు పగుళ్లు ఇచ్చింది. దీన్ని మరింత విస్తరించి ఐరన్ మెష్ వేసి నిర్మిస్తే తప్ప ఆగదు. ఈ సారైనా పకడ్బందిగా నిర్మించాలి.

ఆవాసాల మధ్య డ్రెయినేజీ మురుగునీరు

- దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

వైరా, ఫిబ్రవరి 11: వైరా మునిసిపాలిటీలో అత్యంత వెనుకబడి ఉన్న 8వ వార్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కీలక ప్రభుత్వశాఖల కార్యాలయాల సమీపంలో జాతీయ ప్రధాన రహదారి పక్కనే ఉన్న 8వ వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. నివాసాల మధ్యనే ఉన్న డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జాతీయ ప్రధాన రహదారి పక్కనే ఉన్న బంకు కాలనీలోని వీధుల్లో గతంలో నిర్మించిన డ్రెయినేజీలన్నీ కూలిపోయాయి. డ్రెయినేజీల్లోని మురుగునీరు ఎటూ వెళ్లే పరిస్థితి లేక ఇళ్లలోకి వెళ్తుండటంతో అక్కడి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, పలువురు అధికారులు మురుగునీరు నిలిచిన డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అతీగతీ లేదని అక్కడి పేదలు ఆరోపించారు. ఇదిలా ఉంటే జాతీయ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ అపార్టుమెంట్ ముందు నిలిచిన మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతుంది. స్థానిక తహసీల్దార్, ఎంపీఐ, ఏసీపీ కార్యాలయాలకు ఎదురుగా జాతీయ ప్రధాన రహదారి పక్కన గంధం టవర్స్ నుంచి వస్తున్న వృధా నీరు రోడ్డు పక్కన చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. ఈ అపార్టుమెంట్‌లోని ప్లాట్ల నుంచి వచ్చిన వృథా నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ లేక రోడ్డుపక్కనే నిల్చిపోయింది. ఈ అపార్టుమెంట్‌లోని వృథా నీటిని బయటకు వెళ్లనివ్వకుండా అపార్టుమెంట్ పక్కనే ఉన్న ఇతర నివాసాలు, ఇతరులు మురుగునీటికి అడ్డుకట్ట పోశారు. దాంతో అపార్టుమెంట్ పక్కనే భారీ గుంతలో మురుగునీరు నిల్చిపోయింది. కొన్నినెలల నుంచి మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ మురుగునీటి వలన జాతీయ ప్రధాన రహదారిపై తిరిగే ప్రయాణీకులు, అపార్టుమెంట్‌లో నివాసముంటున్న వారు, పైన పేర్కొన్న ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మురుగునీటి సమస్యపై పలుసార్లు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అపార్టుమెంట్‌లోని నివాసాలవారు, పరిసరాల్లోని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ మురుగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ఓ అపార్టుమెంట్ సమీపంలో నిలిచిన మురుగునీరు

నేటినుంచి ఉపాధిహమీ సోషల్ ఆడిట్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని వివిధ గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు ఉపాధిహమీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులపై సోమవారం నుండి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోషల్ ఆడిట్‌కి సంబంధించి మండల పరిదిలోని జలగంగన్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సోషల్ ఆడిట్ సిబ్బందికి, ఉపాధిహమీ క్షేత్రసహయకులకు సోషల్ ఆడిట్‌పై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతు ఈ ఏడాది కాలంలో సుమారు రూ. 5.62 కోట్ల విలువైన పనులు చేసినట్లు వివరించారు. సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజారావు, ఏపీఓ శ్రీదేవి, ఎస్‌ఆర్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞలో 'పది' విద్యార్థుల వీడ్కోలు వేడుకలు



జ్యోతిప్రజ్వల చేస్తున్న పాఠశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 11: ఖమ్మంనగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో శనివారం రాత్రి పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిచూరి వెంకటేశ్వరరావు, పాఠశాల చైర్మన్ నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమలు హజరై కార్యక్రమాన్ని ప్రారంబించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను నేర్చుకునేది పాఠశాలల్లోనే అన్నారు. విద్యతోపాటు యోగా, కరాటే, డాన్స్, స్పోర్ట్స్ ఐఐటి, నీట్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.9వ తరగతి విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ శకుంతల

కారేపల్లి, ఫిబ్రవరి 11 : కారేపల్లి సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శకుంతల అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశం సాదాసీదంగా కొనసాగింది. సమావేశానికి శాఖల అధికారులు గైర్హాజర్ కావ డం పట్ల ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుపై పలువురు ఎంపీటీసీ సభ్యులు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా తమ ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారని ఎంపీటీసీలు ఆరోపించారు. ఈసమావేశంలో జడ్పీటీసీ జగన్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తసీల్దార్ లక్ష్మి, ఎంపీవో పర్వీన్ పాల్గొన్నారు.

బడ్జెట్‌తో అన్ని వర్గాలకు మేలు

● కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావేద్



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 11: ఆర్థికమంత్రిగా భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉందని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నగరకమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఓబీసీసెల్ అధ్యక్షుడు వీరభద్రంతో కలిసి జావేద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావేద్ మాట్లాడుతూ ఎంతో కీలకమైన ఆర్థికశాఖను భట్టికి అప్పగించటం జిల్లాకే గర్వకారణమన్నారు. గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉండేదని భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ అట్టడుగు వర్గాలకు మేలుచేసేలా ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో ఆరుగ్యారంటీల అమలుకు రూ.53,196కోట్లు కేటాయించటం హర్షనీయమన్నారు.

నల్లగొండ సభను విజయవంతం చేయాలి

చింతకాని, ఫిబ్రవరి 11: నల్లగొండలో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కోరారు. ఆదివారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కేసీఆర్ పాల్గొంటున్న సభకు అధిక సంఖ్యలో మండలం నుంచి కార్యకర్తలు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురిజాల హనుమంతరావు, వంకాయలపాటి లచ్చయ్య, పిన్నెల్లి శ్రీనివాస్, పోట్ల సీతయ్య, పుసులూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రజక సంఘం సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడిగా నాగభూషణం



సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి11: సత్తుపల్లి పట్టణ రజక సంఘ ఎన్నికలలో అధ్యక్షుడిగా విరివాడ నాగభూషణం పోటీలో గెలుపొందారు. సమీప ప్రత్యర్థి అల్లాడి రాముపై 174ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికలలో ముగ్గురు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. ఈ ఎన్నికలలో విజయం సాధించిన నూతన కమిటీని ఎన్నుకుని పలు తీర్మానాలు చేశారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

తల్లాడ, ఫిబ్రవరి 11: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జీఎన్ఆర్ గార్డెన్‌లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు చిర్రా లింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, రైతుసంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి, ఐనాల రామలింగేశ్వరరావు, శేఖర్, మంగళగిరి కాంతారావు పాల్గొన్నారు.

సీపీఎం సానుభూతిపరురాలు మృతి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 11: మండల పరిదిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరురాలు దండుగుల గురవమ్మ (80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నండ్రా ప్రసాద్, నాయకులు నందిగామ కృష్ణ, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, ఆంటోని, వీరన్న, ఉపేందర్, కరుణాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు

మధిరటౌన్, ఫిబ్రవరి 11: మధిర శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమత ఆత్మార్పణ దినోత్సవం సంధర్భంగా దేవాలయ అధ్యక్షుడు కపిలవాయి జగన్ మోహన్ రావు పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం 102 జ్యోతులను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాసుల శేషాచార్యులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీవీఎం పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆదర్శం



పూర్వ విద్యార్థులను సన్మానించిన దృశ్యం

మధిరటౌన్,ఫిబ్రవరి11: మధిర టీవీఎం పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం పలువురికి ఆదర్శంగా నిలిచిందని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ఆదివారం పాఠశాలలో జరిగిన టీవీఎం పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం 46వ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 75వసంతాలు పూర్తి చేసుకున్న పాఠశాల ఎందరినో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దిందని ఎంతో చరిత్ర కలిగిన ఈ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కూడా ఎంతో క్రమశిక్షణ గా ప్రతి సంవత్సరం సమ్మేళనాలు నిర్వహించడం అబినందనీయమని అన్నారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఎంతో అదునాతనమైన భవనాన్ని నిర్మించడం కోసమే కాకుండా రూ.25లక్షల నిధులను సమకూర్చుకోవడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. పాఠశాల సావనీర్‌ను విడుదల చేసి 1988-89 బ్యాచ్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక కృష్ణప్రసాద్, మాదవరపు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు చెరుపల్లి శ్రీధర్, మక్కెన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత



ఏన్కూరు తహసీల్దార్ కార్యాలయం

ఏన్కూరు, ఫిబ్రవరి 11: ఏన్కూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. ప్రధానంగా డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ఆర్ఐ జూనియర్ అసిస్టెంట్‌లను ఖమ్మం కలెక్టరేట్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఉన్న సిబ్బందికి పని భారంగా మారింది. ఆఫీసు సమయానికి మించి నిదులు నిర్వర్తించుతున్న సకాలంలో పనులు జరగడంలేదు. కుల ఆదాయ సర్టిఫికెట్లజారీ తీవ్రజాప్యం జరుగుతుంది. భూ క్రయ, విక్రయాలు, భూసర్వేల్లో కూడా జాప్యయం జరుగుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడతో సిబ్బందిపై పనిభారం బాగా పడింది. ఉన్న సిబ్బంది ఎన్నికల విధులను, ప్రభుత్వ పథకాలను మట్టి తోలకాలను నియంత్రించడం, భారంగా మారింది. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి కుల ఆదాయ సర్టిఫికెట్లు పరశీలన చేయడంలో ఆలస్యం జరుగుతుంది. జిల్లా ఉన్నతాదికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇచ్చేవరకు పోరాటం

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి11: గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇచ్చేవరకు పోరాడతామని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు ఆధ్యక్షతన గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం 21వ మహాసభ నిర్వహించారు.ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌ముదిరాజు మాట్లాడుతూ రాత్రనక, పగలనకా మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించే గ్రామీణ వైద్యులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అంచేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారంగా వారికి గుర్తింపును ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కాగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకురాలు విమలక్క ఈ సభలో తన ఆటపాటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి, ఫిబ్రవరి11: నూతక్కి గంగాధరరావు సేవా కమిటీ ఆధ్వర్యంలో నేలకొండపల్లి సీపీఎం కార్యాయంలో నిర్వహించిన నెలనెలా రెండవ ఆదివారం ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో దాదాపుగా 200 మందికి వైద్య సేవలను అందించారు. ఖమ్మంకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కొల్లి అనుదీప్, ఎండి, జనరల్ శిబిరంలో వైద్య సేవలందించగా, స్థానిక గ్రామీణ వైద్యులు షేక్.తానీషాతో పాటు మరికొందరు సహకరించారు. సేవా కమిటీ నిర్వాహకులు కేవీరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, మంకెనపల్లి నర్సింహారావు, సామాల మల్లిఖార్జున్, అబ్దుల్ రహీంలు వాలంటరీ సేవలందించారు.

లయన్స్‌క్లబ్ అనూహ్య స్పందన

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 11: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం వర్తకసంఘ భవనంలో నిర్వహించిన ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. హైదరాబాద్ యశోధ ఆసుపత్రికి చెందిన వైద్యులు కీర్తి పాలడుగు, మంజూనాద్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి పలు సూచనలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు టి.కృష్ణారెడ్డి, వేముల హనుమంతరావు, జనార్ధన్ రావు, కల్వకుంట్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

కొణిజర్ల, ఫిబ్రవరి 11: ఈనెల 16న జరిగే పారిశ్రామిక సమ్మె గ్రామీణ బంద్‌లో అందరూ సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎస్‌కే ఖాసీం కోరారు. ఆదివారం బంద్‌ను విజయవంతం చేయాలని మండలంలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పఠాన్‌ఖాసీం ఖాన్, భాష, వెంకటేశ్వర్లు, కృష్ణ, అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకం తనిఖీ కేంద్రాలివే

నేలకొండపల్లి, ఫిబ్రవరి11: గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నవారు(నేలకొండపల్లికి చెందిన వారు)సోమవారం నేలకొండపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాయంల, నేలకొండపల్లి విద్యుత్ కార్యాయం, రైతు వేదికల వద్దకు వివరాలతో రావాలని ఏఈఈ ఆపరేషన్స్ రామారావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కౌంటర్లలో సిబ్బంది ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఉంటారని అన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు పైన పేర్కొన్న ఏదేని కౌంటర్ వద్దకు వెళ్ళి వివరాలు యమోదు చేయించుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'గృహజ్యోతి' పథకం కోసం అధికారుల కసరత్తు

● 200యూనిట్లు లోపు వినియోగించే వారికి సదావకాశం

● జీవో వస్తేనే ఎంతమంది అర్హులో తెలిసేది

కొణిజర్ల,ఫిబ్రవరి11: ప్రభుత్వం గృహజ్యోతి పేరుతో ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే అధికారులు ప్రజాపాలనలో గృహజ్యోతికి పెట్టుకున్న దరఖాస్తుల స్లీప్‌లను పరిశీలిస్తూ ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నెంబరు వివరాలను ఇంటింటికి తిరుగుతూ మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడు చేస్తున్నారు. 200 యూనిట్లులోపు వినియోగిస్తున్న వివరాలు ప్రభుత్వం అమలు చేసే జీవో ద్వారా తెలియనున్నాది. ప్రజల్లో 200 యూనిట్ల కంటే ఎక్కువ వాడుకుంటే ఆ పథకానికి అర్హులం అవుతామా లేదా అనే సందేహం వ్యక్తం అవుతుంది. అధికారుల నుంచి కూడ జీవో వస్తేనే పూర్తిగా తెలుస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు.అద్దె ఇంటిలో ఉంటున్నారు వారి వివరాలను కూడ అధికారులు అప్‌లోడు చేస్తున్నారు. దాంతో కిరాయిదారులకు కూడ 200 యూనిట్ల పథకం వర్తిస్తుంది. పథకం అమలుకాగానే చాలా మంది సంతోషపడనున్నారు. ట్రాన్స్ కో ఏఈ సురేష్ మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న సమయంలో తప్పులు ఉన్న కూడ ఇంటింటికి తిరిగి వారి వివరాలు అప్‌లోడు చేయడం వలన వారికి ఇబ్బంది ఉండదని, అర్హులకి తప్పకుండ పథకం వర్తిస్తుందని తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1983-85బ్యాచ్ ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 11: నలభై ఏళ్ల క్రితం వారంతా స్నేహితులు.. ప్రస్తుతం స్థిరపడింది వేర్వేరు ప్రాంతాలైనా ఒకేచోట చదువుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యను కలిసి చదువుకుని నేడు ప్రయోజకులు అయిన తర్వాత తామ మరలా కలిసేందుకు విద్యాబుద్ధులు నేర్చుకున్న కళాశాల వేదిక అయింది. సత్తుపల్లి శ్రీ బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1983-85బ్యాచ్‌కు చెందిన హెచ్‌ఈసీ, సీఈసీ పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు నడుమ గత స్మృతులను నెమరేసుకున్నారు. గురువులను గుర్తు చేసుకున్నారు. మృతిచెందిన తోటి మిత్రుల చిత్రపటాల వద్ద పూలుజల్లి మౌనం పాటించారు. ఇప్పటి జ్ఞాపకాలను భవిష్యత్‌లోనూ గుర్తుంచుకునేలా అందరితో కలిసి తీసుకున్న ఫోటోలను అప్పటికప్పుడే ఫ్రేమ్ కట్టించుకుని ప్రతిఒక్కరికీ బహుకరించుకున్నారు. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమతమ సామాజిక మాధ్యమాలలో షేర్ చేసుకున్నారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ అస్తవ్యస్తం

- కీలక ఉద్యోగుల బదిలీతో పనుల్లో తీవ్రజాప్యం
- కనబడకుండా పోతున్న పైళ్లు
- ఏ సమాచారం అడిగినా దొరకదు



ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి 11: ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. వివిధ ధృవపత్రాలకు సంబంధించిన రెండు విభాగాల్లో ఇద్దరు కీలక ఉద్యోగులు బదిలీ కావటం, వారి స్థానంలో వేరే ఉద్యోగులు రాకపోవటంతో పనుల్లో తీవ్రజాప్యం జరుగుతున్నది.

కనిపించని పైళ్లు..

పలు పైళ్లు కూడా కనబడ కుండా పోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రజలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పనుల కోసం తిరుగుతున్నారు. అయితే పైళ్లు కనబడ టం లేదని అక్కడి ఉద్యోగులు చెప్పటంతో తీవ్ర ఆందోళనకు గురవు తున్నా రు. ప్రస్తుతం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పరి స్థితి ఎలా ఉందంటే ఏ సమాచారం అడిగినా, తమ వద్ద లేదని సమాధానం చెబుతున్నారు. ఖమ్మం నగరానికి చెందిన ఒక మాజీ కౌన్సిలర్ గతంలో కోర్టుకు తహసీల్దార్ ఇచ్చిన లేఖకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీ కావాలని ఆర్టీఐ ద్వా రా దరఖాస్తు చేసి నెలలు గడిచాయి. అయితే సదరు కాపీ తమవద్ద లేదని అధికారులు చెప్పటం గమనార్హం. అయితే సదరు మాజీ కౌన్సిలర్‌కు లిఖిత పూర్వకంగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. అతడు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఒక మహిళ కుటుంబ సభ్యుల వివరాలు ధృవపత్రం కోసం దరఖాస్తు చేస్తే ఒకసారి పైలు కనబడలేదని, మరోసారి తరువాత రమ్మని ఇలా తిప్పుతున్నారు.

ధృవపత్రాల జారీపై తీవ్రప్రభావం

వివిధ రకాల ధృవపత్రాల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేస్తే సదరు దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అప్‌లోడ్ చేయాల్సిఉంటుంది. కాగా జనన, మరణ ధృవీకరణ పత్రాలు జారీచేసే విభాగం, ఆదాయం, కుల, నివాస ధృవీకరణ పత్రాలు జారీచేసే విభాగం వేరువేరుగా ఉంటాయి. అయితే సదరు విభాగాలను నిర్వహించే ఇద్దరు ఉద్యోగులు బదిలీ కావటంతో సదరు విభాగాల్లో వీఆర్‌ఏ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా వచ్చిన వారికి బాధ్యతలు అప్పగించారు. ఇది ధృవపత్రాల జారీపై తీవ్ర ప్రభావం చూపెడుతోంది. వారు సెలవు పెడితే సదరు విభాగాలకు తాళం వేస్తున్నారు. అంతేకాకుండా బాధ్యతలు కొత్త కావటంతో ధృవపత్రాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఆర్‌ఐలు విచారణ చేసిన దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా రావటంతో కొన్ని దరఖాస్తులు కనబడకుండా పోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

నెలలు గడిచినా...

ధృవపత్రాలకోసం దరఖాస్తులు చేసి నెలలు గడిచినా వాటిని పరిశీలించడం లేదు. ఆదాయ, నివాస ధృవపత్రాల సైతం సకాలంలో ఇవ్వటం లేదు. ఉన్న ఉద్యోగులకు ఎన్నికల బాధ్యతలు సర్వేపనులు అప్పగించటం, అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సరిపడా సిబ్బంది లేకపోవటంతో పౌరసేవలు అందటం లేదు. దీంతో వారంరోజుల్లో జారీ చేయవలసిన ధృవపత్రాలు నెలలు గడిచినా రావటంలేదు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.